

సక్సెస్‌పై ఫోకస్







మహాజాతర నిర్వహణపై మంత్రుల ప్రత్యేక దృష్టి

- మేడారంలో మహిళా అమాత్యుల పాత్ర కీలకం
- వారి సారథ్యంలోనే తెలంగాణ కుంభమేళా
- దేవాదాయ శాఖ మంత్రిగా కొండా సురేఖ
- స్థానిక ఎమ్మెల్యే, పంచాయతీరాజ్ మంత్రిగా సీతక్క
- వీరిద్దరిపైనే ప్రధాన బాధ్యత

భూపాలపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మేడారం మహాజాతరకు సమయం దగ్గర పడుతోంది. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరిగే తెలంగాణ కుంభమేళాకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మహిళా మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క ప్రత్యేక ఫోకస్ పెట్టారు. స్వరాష్ట్రంలో కాంగ్రెస్ తొలిసారిగా అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత జరుగుతున్న జాతర కావటంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈసారి మంత్రులు కొండా సురేఖ, సీతక్కల పర్యవేక్షణలో సమ్మక్క, సారలమ్మ జాతర జరగనుంది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొండా సురేఖ వెంటనే మహాజాతరకు రూ.75కోట్లు కేటాయిస్తూ తొలి సంతకం చేశారు. ములుగు జిల్లాలోనే ఈ జాతర నిర్వహించనుండగా స్థానిక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రిగా కొనసాగుతున్న సీతక్క కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరు మహిళా మంత్రులు మహాజాతరను విజయవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

ప్రతి రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమి వేళ వచ్చే బుధ, గురు, శుక్ర, శనివారాల్లో మేడారం మహాజాతర జరుగుతుంది. 2024లో ఫిబ్రవరి 21, 22, 23, 24తేదీల్లో నిర్వహించేందుకు గిరిజన పూజారులు ముహూర్తం ఖరారు చేశారు. ఈ జాతరకు తెలంగాణతోపాటు ఏపీ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి గిరిజనులు, ఇతర సామాజికవర్గానికి చెందిన వారు కోటి మందికిపైగా తల్లుల దర్శనానికి వస్తారు. ప్రతి ఏటా ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం నిధులు కేటాయిస్తోంది. తాగునీరు, మరుగుదొడ్లు, స్నానఘట్టాలు, రోడ్ల మరమ్మతులు తదితర సౌకర్యాల కోసం గత మూడు జాతరలకు అప్పటి ప్రభుత్వం రూ.75 కోట్ల చొప్పున మంజూరు చేసింది. ఈసారి కొత్త ప్రభుత్వం కూడా రూ.75 కోట్లే విడుదల చేసింది. జూలైలో భారీ వర్షాలు, వరదలకు మేడారంలో శాశ్వత కట్టాలు, రోడ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. ఈసారి కనీసం రూ.120 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని బీఆర్ఎస్ ప్రభుత్వానికి రెండు విడతల్లో అధికారుల నివేదికలు వెళ్లాయి. ఎన్నికల కోడ్ కారణంగా అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. అయితే.. తొలిసారి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ.75 కోట్ల నిధులే కేటాయించింది. దీంతో ఆయా శాఖల వారీగా పనుల టెండర్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సమయం దగ్గర పడుతుండటంతో త్వరగా పనులు పూర్తి చేసేలా అధికార యంత్రాంగం దృష్టిపెట్టింది.

కొండంత ఆశలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రి వర్గంలోకి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరికి చోటు కల్పించారు. ఆ ఇద్దరు కూడా మహిళలే కావడం విశేషం. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన కొండా సురేఖకు అటవీ, పర్యావరణ శాఖతోపాటు దేవాదాయ శాఖను అప్పగించారు. దీంతో మేడారం మహాజాతర నిర్వహణ బాధ్యత మొత్తం దేవాదాయ శాఖ మంత్రిగా ఆమె పైనే ఉంటుంది. గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న కొండా సురేఖ మేడారం మహాజాతరను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. సమ్మక్క, సారలమ్మను కొండా దంపతులు తమ ఇలువేల్పుగా కొలుస్తారు. దీంతో దేవాదాయ శాఖ మంత్రిగా సురేఖకు సమ్మక్క, సారలమ్మలకు సేవ చేసుకునే అవకాశం దక్కినట్టు భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన ప్రతిపాదనల మేరకు రూ.75కోట్లు విడుదల అయ్యాయని, అవసరమైతే జాతరలో సౌకర్యాల కల్పనకు అదనంగా నిధులు కేటాయించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని మంత్రి సురేఖ ప్రకటించారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి మేడారం మహాజాతరకు జాతీయ హోదా సాధించటంతోపాటు ప్రస్తుతం జరగనున్న జాతర అభివృద్ధి పనులకు నిధులు సాధించటం సురేఖ ముందున్న సవాళ్లని భక్తులు భావిస్తున్నారు. అయితే.. గిరిజన కుంభమేళా అయిన మేడారం మహాజాతరను సక్సెస్ చేయటంపై మంత్రి ప్రత్యేక దృష్టిసారించారు. త్వరలో మేడారంలో సమీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మంత్రిగా సీతక్కకు తొలిచాన్స్

ఆదివాసీ మహిళా నేత, మంత్రి సీతక్క సొంత నియోజకవర్గంలోనే మేడారం జాతర జరగనుంది. 2009, 2018లో ఎమ్మెల్యేగా గెలిచిప్పటికీ ప్రతిపక్షంలోనే ఆమె ఉండాల్సి వచ్చింది. దీంతో జాతర నిర్వహణలో అధికార పక్ష నేతలదే పైచెయ్యి ఉండేది. 2023 ఎన్నికల్లో మూడోసారి గెలిచి రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చోటు సంపాదించుకున్న సీతక్కకు తొలిసారి మంత్రిగా తమ ఇలువేల్పు సమ్మక్క, సారలమ్మ జాతరను నిర్వహించే అవకాశం దక్కింది. దీంతో జాతర సక్సెస్‌ను ఆమె సవాల్‌గా స్వీకరిస్తున్నారు. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా సీతక్క జాతరలో కీలక పాత్ర పోషించనున్నారు. దీంతోపాటు స్థానిక మంత్రిగా జాతర నిర్వహణను తన భుజస్కంధాలపై వేసుకోనున్నారు. ఇప్పటికే మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అధికారులతోనూ జాతర నిర్వహణపై సమీక్షించారు. శాఖల వారీగా మంత్రులను ఆహ్వానించి మేడారం జాతర అభివృద్ధిపై సమీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తానికి తొలిసారిగా ఇద్దరు మహిళా మంత్రుల చేతుల్లో మేడారం మహాజాతర నిర్వహణ బాధ్యతలు ఉండటం ఇదే తొలిసారి.



ఈసారి కష్టాలే..!

ఈసారి మేడారం మహాజాతర నిర్వహణ అధికారులకు, మంత్రులకు సవాలే అనే టాక్ వినిపిస్తోంది. గత జూలైలో కురిసిన వర్షాలకు మేడారం చిన్నాభిన్నమైంది. రికార్డు స్థాయిలో జంపన్నవాగు మేడారం గద్దెలను తాకుతూ ప్రవహించింది. దీంతో జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ కట్ట మండపాలు, సులభ్‌కాంప్లెక్సులు, స్నానఘట్టాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రెడ్డిగూడెం, ఊరట్టం, మేడారం, నార్లాపూర్, కొత్తూరు తదితర గ్రామాల్లో అంతర్గత రోడ్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయి. కేవలం రెండు రోజుల్లో కురిసిన వర్షాలకే సుమారు రూ.25కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. ఈ నిధుల కోసం గత ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపినప్పటికీ నిధులు మాత్రం విడుదల కాలేదు. ప్రస్తుతం జాతరకు కొత్త ప్రభుత్వం ఎప్పటిలాగే రూ.75కోట్లు కేటాయించింది. వీటిలో ఆర్‌అండ్‌బీ శాఖకు 2.80కోట్లు, పీఆర్ శాఖకు రూ.4.35 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులతో రోడ్ల మరమ్మతులు కష్టమే అని తెలుస్తోంది.

అభివృద్ధి పనులు పూర్తి కావాలి

నిధులను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

కాటారం, జనవరి 2: ప్రజల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను భూపాలపల్లి కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి వివిధ పథకాల కింద వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంథని నియోజకవర్గం పరిధిలోని కాటారం రెవెన్యూ డివిజన్ మండలాల అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులు, ఎంపీపీలు, జడ్పీటీసీలతో ఆయన కాటారం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. పలు అంశాలపై సమీక్షించారు. సీడీపీ, డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్, నీతిఆయోగ్ కింద వివిధ అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధులను పూర్తిగా వినియోగించుకుని నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలన్నారు. పనులు ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి నిధులను పూర్తిగా వినియోగించి అభివృద్ధి పనులు పూర్తిచేసి వాటి యూసీలను సమర్పించాలన్నారు. 2020-2022 ఆర్థిక సంబంధించిన సీడీపీ పెండింగ్ పనులు పూర్తిచేసి ఎంబీలు, యూసీలు అందజేయాలని ఆదేశించారు. బస్టాండ్‌లో మౌలిక సౌకర్యాలు, ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్స్, సీసీ రోడ్లు, వైకుంఠధామాలు, ఎస్‌డీఎఫ్ కింద చేపట్టిన కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కాటారం శివారులోని సర్వే నంబర్లు 418, 501లో భూసమస్యలు పరిష్కరించి త్వరలో 200 మంది రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీవో శామ్యూల్, కాటారం ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, మల్హర్, మహాముత్తారం, మహదేవపూర్ జడ్పీటీసీలు ఐత కోమల, లింగమల్ల శారద, గుడాల అరుణ, మహదేవపూర్, మల్హర్ ఎంపీపీలు బన్సోడ రాణిబాయి, మలహల్‌రావు, కాటారం తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీట్ ఆఫీసర్‌పై చర్య తీసుకోవాలని వినతి



ఐటీడీఏ ఏపీఓ కు వినతి అందిస్తున్న తుడందెబ్బ నాయకులు

కన్నాయిగూడెం, జనవరి 2 : మండలంలోని గుర్రేవుల ఫారెస్టు బీట్ ఆఫీసర్‌పై చర్య తీసుకోవాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోరగట్ల లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవో వసంతరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని ముప్పనపల్లి పంచాయతీ పరిధి బోరుగూడేనికి చెందిన ఆర్వోఎఫ్ఆర్ అటవీహక్కుల చట్టం 2005 ద్వారా హక్కు పత్రం పొందిన పోడు రైతు గుండ్ల పాపారావును వేధిస్తున్న బీట్ ఆఫీసర్‌పై చర్య తీసుకోవాలని కోరారు. డబ్బులు ఇవ్వాలని ఆ రైతును డిమాండ్ చేశారని, ఇవ్వకపోవడంతో కక్షగట్టి బోరుబావిని ధ్వంసం చేసి రాళ్లు వేసి ఆమె పూడ్చారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజ నారాయణ, జిల్లా అడ్వయిజర్ నల్లబోయిన లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో సేవలు అందించాలి

పోలీసు సిబ్బందితో భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 2: పోలీసు సిబ్బంది అంకితభావంతో పనిచేసి శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. భూపాలపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పోలీసు దర్బార్‌లో ఆయన మాట్లాడారు. సిబ్బందికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలో సంభవించిన వరదల్లో, ఎన్నికల బందోబస్తులో సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎన రేష్ కుమార్, ఏఆర్ అనదపు ఎస్పీ వి. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు సూర్య ప్రకాశ్, రాజేశ్వర్‌రావు, రత్నం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసులకు ఉత్తమ పతకాలు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 2: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే ఉత్తమ సేవా పతకాలకు పలువురు జిల్లా పోలీసులు ఎంపికయ్యారు. కాటారం పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న రంజిత్‌రావు కఠినా సేవా పత కం, అలాగే, డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై ప్రతాప్‌రెడ్డి, ఆర్ఐ రాంప్రసాద్‌కు ఉత్తమ సేవా పతకాలు, ఏఆర్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్సైలు వెంకట సత్యనారాయణ, గడిపెల్లి శ్రీనివాస్, కానిస్టేబుల్స్ సారయ్య, సుధాకర్ సేవా పతకాలకు ఎంపికైనట్టు ప్రభుత్వం ప్రకటించింది.

గుట్టలు దిగి వచ్చి..

ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులు అందజేసిన పెనుగోలు వాసులు



ప్రజాపాలన శిబిరంలో దరఖాస్తులు అందిస్తున్న పెనుగోలు గిరిజనులు

వాజేడు, జనవరి 2: మండలంలోని కొంగాల గ్రామ పంచాయతీ పరిధి పెనుగోలు వాసులు గుట్టలు దిగి వచ్చారు. జగన్నాథపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ సభకు తరలివచ్చారు. ప్రభుత్వ పథకాల కోసం తమ దరఖాస్తులను అధికారులకు అందజేశారు. మూడు గుట్టలు, మూడు వాగులు దాటుకుంటూ 16కిలోమీటర్లు నడిచి వచ్చిన ఈ గిరిజనులు గ్రామ సభలో బారులు తీరారు. నిరక్షరాస్యులైన వారికి అధికారులు సహకరించారు. దరఖాస్తులు నింపి, వాటిని స్వీకరించారు. దరఖాస్తులను త్వరగా స్వీకరించి తిరిగి పెనుగోలుకు పంపారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రం వద్ద వాజేడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మధుకర్ వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

గిరిజనుల జీవన ప్రమాణాలపై అధ్యయనం

గోవిందరావుపేట, జనవరి 2: గిరిజనుల జీవన ప్రమాణాలపై హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ అధ్యయనం చేసింది. మండలంలోని ప్రాజెక్టునగర్, మొట్లగూడెం గ్రామాల్లో ఆ సంస్థ ప్రతినిధులు కలెక్టర్ ఇలా త్రిపాఠీతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా కలెక్టర్ పలు అంశాలను వివరించారు. గిరిజనులకు అందుతున్న విద్యాభ్యాసం, మహిళా సాధికారత, వృత్తి నైపుణ్యం, ఉపాధి అవకాశాలు, కంప్యూటర్ శిక్షణపై చర్చించారు. గత ఏడాది భారీ వరదలకు ధ్వంసమైన ఇళ్ల మరమ్మతులు, పునర్నిర్మాణం తదితర సౌకర్యాల కల్పన ఆవశ్యతక గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, సంక్షేమ జిల్లా అధికారి ఈపీ.ప్రేమలత, నిర్మాణ్ సంస్థ అసిస్టెంట్ సీఈవో ఉమాకరణి, ప్రోగ్రాం ఆఫీసర్లు నిఖిల్, అనురాధ, సీఈవోలు ఇమ్రాన్ అలీ, డేవిడ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఐనవోలు జాతర ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

ఐనవోలు, జనవరి 2: ఐనవోలు జాతర ఏర్పాట్లను దేవదాయధర్మదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం ఆలయానికి వచ్చిన కమిషనర్ అధికారులతో సమావేశమై జాతర ఏర్పాట్లను ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావును అడిగి తెలుసుకున్నారు. జాతరలో ఎలాంటి లోటు పాట్లు జరుగకుండా భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అంతకు ముందు కమిషనర్ స్వామి వారిని దర్శించుకోగా అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. డిప్యూటీ కమిషనర్ టి. శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమీషనర్ ఆర్. సునీత, అధికారులు సంజీవరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న కమిషనర్ అనిల్‌కుమార్

జాతర పార్కింగ్.. క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర పార్కింగ్ క్యూలైన్ల ఏర్పాట్లను ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అధికారులతో కలిసి పరిశీలించారు. మామునూరు ఏసీపీ సతీష్, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై నవీన్‌కుమార్‌లతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆలయానికి వచ్చే నాలుగుదారులకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలతోపాటు క్యూలైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సకాలంలో పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకరావాలని తెలిపారు.

అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

▸▸ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

నయీంనగర్, జనవరి 2: అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో మంగళవారం వివిధ శాఖల డైరెక్టర్లు, ఐన్‌టియూసీ-327 యూనియన్ నాయకులు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా పరిపుష్టిగా కంపెనీ ఉండాలంటే అందరూ కలిసికట్టుగా పని చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. వినియోగదారులను గౌరవించడం వారి సమస్యలను పరిష్కరించడం ఏటి అండ్ సి నష్టాలను తగ్గించాలని ఆయన కోరారు. విద్యుత్ భద్రతా సూచనలు ఉద్యోగస్తులు, వినియోగదారులు విధిగా పాటిస్తూ విద్యుత్ ప్రమాదాలను నివారించాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పిమోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్ధన్, ఐన్‌టియూఈ-327 యూనియన్ నాయకులు మహేందర్‌రెడ్డి, బుచ్చయ్యగౌడ్, నీలారావు శ్రీనివాస్, ఓదేలు, సోమయ్య, సీజీయంలు, జీయంలు పాల్గొన్నారు.



సీఎండీ వరుణ్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు

అభివృద్ధి పనులు ముందుకు సాగేనా, ఆగేనా?

హడావుడి ప్రారంభాలు, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదరించేనా..

- విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కేటాయింపు కాని డబుల్ ఇళ్లు, పూర్తికాని రహదారులు

తొర్రూరు రూరల్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 2 : పాలకుర్తి నియోజకవర్గానికి కేంద్రంగా ఉంటూ అన్నిరంగాల్లో దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరు మండలం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి ఎన్.సుధాకర్ రావు, దుగ్యాల శ్రీనివాసరావు ఎమ్మెల్యేలుగా కొనసాగినా స్వరాష్ట్రంలో 2014, 2018 సంవత్సరంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా కొనసాగుతూ కొంతమేర అభివృద్ధి చేసినప్పటికీ ఆశించిన మేరకు కాలేదు. దీంతో 2023 అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో తొర్రూరు మండలంలో కోట్లాది రూపాయల పనులకు హడాహుడిగా శంకుస్థాపనలు చేసి, ఎర్రబెల్లి ఓడిపోయారు. శంకుస్థాపన పనులు జరిగిన అభివృద్ధి పనులు ముందుగు సాగేనా, నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తొర్రూరు మినిట్యాంకు బండ్, విద్యావైద్యం, బెడ్రూం ఇళ్లు, రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరముంది.


తొర్రూరు మండలం గోపాలగిరిలో ఆయిల్ పామ్ పరిశ్రమ జరిగే స్థలం, శిలాఫలకం (ఫైల్)

మినీట్యాంకు బండ్, ఆయిల్‌పామ్ పరిశ్రమ పూర్తి అయ్యేనా..?

తొర్రూరు పెద్దచెరువును మినీట్యాంకు బండ్ చేస్తామంటూ 2017-18 సంవత్సరంలో గత ప్రభుత్వం రూ.3 కోట్ల 60 లక్షల నిధులను మంజూరు చేసింది. బండ్ పనులకు హడావుడిగా టెండర్లు పిలిచారు. దీంతో రూ.2 కోట్ల 19 లక్షలతో కాంట్రాక్టర్లు కట్ట మరమ్మతులు, బ్రిడ్జి నిర్మాణం కోసం పిల్లర్లు, పూడికతీత వంటి పనులు చేసి వదిలేశారు. మొత్తంగా బతుకమ్మ ఘాట్, బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉన్నా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పూర్తిస్థాయిలో ట్యాంక్ బండ్ నిర్మాణం కావాలంటే అధిక నిధులు కావాల్సి ఉంటుందంటూ అందుకనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరువ చూపి త్వరితగతిన పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూనెగింజల ఉత్పత్తి చేయాలనే లక్ష్యంగా ఆయిల్‌ఫాం పంట సాగుకు సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించింది. అందులో భాగంగానే పంటను విక్రయించుకోవడానికి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో తొర్రూరు మండలం గోపాలగిరి గ్రామంలో 111 సర్వేనెంబర్‌లో సుమారు 85 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించారు. అందులో 45 ఎకరాల్లో రూ.175 కోట్ల నిధులతో అత్యాధునికమైన పరిశ్రమను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడం కోసం ఎర్రబెల్లి దయాకర్ రావు సెప్టెంబరు 2023న ప్రారంభించారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో వెయ్యికి పైగా రైతులు 4,769 ఎకరాలలో పామాయిల్ సాగు కొనసాగతుండగా, 2023-24కుగాను 8 వేల ఎకరాల పంట సాగు చేయడానికి లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. వచ్చే ఏడాది కొంత పంట చేతికి వచ్చే సమయానికి పరిశ్రమను అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్‌ఫాం రైతులు కోరుతున్నారు.

ఇళ్ల కేటాయింపు చేయాలి

తొర్రూరు మండలంలోని పేద ప్రజల సంక్షేమానికి ఇళ్లు లేనిపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పడంతో కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించినా కేటాయింపులు చేయలేదు. గృహలక్ష్మీ పథకం కింద రూ.5లక్షలు ఇస్తామనడంతో సుమారు 3,418 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. తొర్రూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని సుమారు 900 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా, 200 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. అయితే కర్కాల, కంఠాయపాలెం, గుర్తూర్, మాటేడు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి అయినా లబ్ధిదారుల ఎంపిక చేకపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి. గుర్తూర్ గ్రామంలో 40 ఇళ్లకుగాను 20, కర్కాల గ్రామంలో 20 ఇళ్లు పూర్తైనా లబ్ధిదారుల కేటాయింపు చేయకపోవడంతో ప్రజలు వెళ్లి ఉంటున్నారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా తొర్రూరు మండలంలోని కర్కాల గ్రామంలో పాలేరు వాగు పై బ్రిడ్జి, గుర్తూర్ -ఎర్రబెల్లి గూడెం గ్రామాల మధ్య ఆకేరు వాగు పై నిర్మించే బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారు. అయితే గుర్తూర్‌లో నిర్మించే బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్ల 64 లక్షలకు టెండర్లు పిలిచి ఓపెన్ చేయలేదు. గుర్తూర్ గ్రామం నుంచి మడిపల్లి, ఫత్తేపురం, తొర్రూరు వచ్చే రహదారి నిర్మాణం పనులు ప్రారంభించి వదిలేశారు. గోపాలగిరి, చెర్లపాలెం మధ్య రహదారి, చింతలపల్లి, కొమ్మనపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారి, మున్సిపాలిటీలో పలు కాలనీల్లో కంకరపోసి వదిలేశారు. మండల వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం కోసం స్థానిక ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


మినీట్యాంకు బండ్ కోసం ఫిల్లర్ల నిర్మాణంకే పరిమితమైన తొర్రూరు పెద్ద చెరువు


తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో పూర్తి అయిన డబుల్‌బెడ్రూం ఇళ్లు

వంద పడకల ఆస్పత్రి కోసం ఎదురుచూపులు..

తొర్రూరు మండలంలో గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్తామామలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, రాజేందర్ రెడ్డి దంపతులు సొంత ఖర్చులతో నిర్మించిన 30 పడకల ఆస్పత్రి మాత్రమే ఉంది. రోగుల తాకిడితో ఆస్పత్రి భవనం సరిపోకపోవడంతో వంద పడకల ఆస్పత్రి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసి తొర్రూరు, మరిపెడ మండలాలకు సంబంధించి వంద పడకల ఆస్పత్రిని మరిపెడ మండల కేంద్రంలో అప్పట్టి వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. వంద పడకల ఆస్పత్రికి సుమారు 3 ఎకరాల స్థలం అవసరం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో స్థల సేకరణ చేయాల్సి ఉంది. అప్‌గ్రేడ్ అయినా ఆ స్థాయిలో వైద్యపరీక్షలు మాత్రం అందకపోగా, కనీసం ఆస్పత్రిలో గైనకాలజిస్టు, పిల్లల వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఎంబీబీఎస్ వైద్యులు నామమాత్రంగా చూస్తున్నారు. గ్రామీణ ప్రాంతా ప్రజలు ప్రత్యేక వైద్యనిపుణుల కోసం వరంగల్, ఖమ్మంతో పాటు ప్రసవాలకు వర్ధన్నపేట, వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి వెళ్తున్నారు. అదేవిధంగా తొర్రూరు, పెద్దవంగర మండలాల నుంచి డిగ్రీ విద్యను పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించడానికి పీజీ, బీఈడీ, ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడంతో వరంగల్, హైదరాబాద్, ఖమ్మం ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసించే ఆర్థిక పరిస్థితి లేని పేద విద్యార్థులు మధ్యలో చదువులు మానేస్తున్నారు. ఇప్పటికైనా విద్య, వైద్యం పై ప్రత్యేక దృష్టిసారించాలని విద్యార్థులు, మేధావులు కోరుతున్నారు.

ఉచిత ప్రయాణంతో అద్దె బస్సులకు డీజిల్ భారం

హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ రీజినల్ అధ్యక్షుడు రాంరెడ్డి

ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేత


ఆర్ఎం శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ నాయకులు

సుబేదారి, జనవరి 2: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో అద్దె బస్సులకు డీజిల్ భారం పెరిగిందని హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ రీజినల్ అధ్యక్షులు మారిపెల్లి రాంరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ఆర్టీసీ రీజియన్ కార్యాలయంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ ఆధ్వర్యంలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జె. శ్రీలతకు అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకానికి ముందు బస్సులలో 45 నుండి 60 మంది వరకు ప్రయాణికులు ప్రయాణించేవారని, ఇప్పుడు ఉచిత బస్సు పథకంతో ఆ సంఖ్య గణనీయంగా పెరిగి బస్సుల టైర్లపై భారం పడుతుందన్నారు. అలాగే బస్సుల కమాన్ పట్టీలు విరుగుతున్నాయని, బస్సు మెయింటెనెన్స్ విపరీతంగా పెరుగుతుందన్నారు. ఓవర్‌లోడ్ కారణంగా కేఎంపీఎల్ బాగా తగ్గిపోయిందని, దీనివల్ల 4.5 కేఎంపీఎల్ ఇవ్వాలన్నారు. జనవరి 5వ తేదీలోగా మా సమస్యలు పరిష్కరించాలని, లేదంటే 5 నుంచి సమ్మె చేస్తామని ఆర్ఎంకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు రాంరెడ్డి, తెలిపారు. ఆర్ఎంకు వినతిపత్రం అందజేసినవారిలో హైర్ బస్సు ఓనర్స్ రాష్ట్ర నాయకులు లక్కం ప్రభాకర్, కె. సదానందం, వెంకటేశ్వర్లు, పి. కుమార్, వి. వెంకట్‌రెడ్డిలు ఉన్నారు.

కారు ఢీకొని బాలుడి మృతి

మహబూబాబాద్ జిల్లా ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద ఘటన


విజయ్‌ప్రకాష్ (ఫైల్)

మహబూబాబాద్‌రూరల్, జనవరి 2 : కారు ఢీకొన్న ఘటనలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద మంగళవారం మధ్యాహ్నం చోటుచేటు చేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. గూడూరు మండలం మచ్చర్లకు చెందిన చింతల వినోద-సుధాకర్ దంపతులు హైదరాబాద్‌కు వలస పోయి కూలీనాలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు విజయ్‌ప్రకాష్ (8) అదే గ్రామంలోని అమ్మమ్మ ఈసం నర్సమ్మ వద్ద ఉంటూ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం సెలవులు రావడంతో హైదరాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. సోమవారం రాత్రి మహబూబాబాద్‌కు చేరుకున్న కుటుంబసభ్యులు రాత్రి కావడంతో ముత్యాలమ్మగూడెంలోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. తర్వాత మంగళవారం మధ్యాహ్నం మచ్చర్లకు వెళ్లేందుకు ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద ఆటో ఎక్కుతున్న క్రమంలో చెన్నారావుపేట నుంచి కురవికి వెళ్తున్న కారు ఆటోకు కుడివైపున ఉన్న బాలుడు విజయ్‌ప్రకాష్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తమ కళ్లముందే కుమారుడు మృతి చెందడంతో వారు ఒక్కసారిగా షాక్ గురయ్యారు. కొద్దిసేపట్లో స్వగృహానికి వెళ్లాల్సిన బాలుడు అనంతలోకాలకు వెళ్లడంతో కుమారుడి మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు చివరి గడువు

హనుమకొండ రూరల్, జనవరి 2 : ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఎవరైనా పరీక్ష ఫీజు చెల్లించనట్లయితే బుధవారం రూ.2500 అపరాధ రుసుంతో చెల్లించవచ్చని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఏ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని గమనించి ఇంటర్ వార్షిక ఫీజు చెల్లించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

- మృతురాలి బంధువుల ఆందోళన
- ధర్మారంలో ఉద్రిక్తత


లక్ష్మీ (ఫైల్)


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న లక్ష్మీ బంధువులు

పరకాల , జనవరి 2 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన నడికూడ మండలం ధర్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ మండలం ధర్మారం గ్రామానికి చెందిన నక్క లక్ష్మి (40), ఎర్రన్న దంపతులకు 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భర్తతో గొడవపడి లక్ష్మి ఐదేళ్లుగా వేరే ఇంట్లో కిరాయికి ఉంటోంది. డిసెంబరు 28న రేషన్ కార్డు విషయమై తన భర్త ఎర్రన్న ఇంటికి వెళ్లి మాట్లాడి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామంలోని బొడ్రాయి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. బంధువులు, స్థానికులు గమనించి వెంటనే 108 ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి చికిత్స పొందుతూ జనవరి 1 (సోమవారం) మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం లక్ష్మీ మృతదేహాన్ని తన భర్త ఎర్రన్న ఇంటి ముందు వేసి బంధువులు రహదారిపై ధర్నా చేశారు. కొన్నేళ్లుగా ఎర్రన్న లక్ష్మీని పట్టించుకోలేదని, ఎర్రన్న ఆస్తిని లక్ష్మీ కూతురు పేరు మీద రాయాలని ఆందోళన చేశారు. ఎర్రన్న లక్ష్మీని ఇబ్బందులకు గురిచేసి కూతురు ఉన్నా వేరే పెళ్లి చే సుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీ కుటుంబానికి న్యాయం చేయాలని నినాదించారు. మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో పరకాల సీఐ వెంకటరత్నం, ఎస్సై లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువుల ను సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా లక్ష్మీ బంధువులు వినకపోవడంతో పోలీసులు బలవంతంగా లాక్కెళ్లారు. మహిళలను పక్కకు నెట్టివేయడంతో గ్రామ సర్పంచ్ గోల్కొండ ఉమ, ఆమె భర్త సదానందం సీఐతో వాగ్వాదానికి దిగారు. మహిళలను నెట్టివేయడం సరికాదన్నారు. చివరకు పరారీలో ఉన్న లక్ష్మీ భర్త ఎర్రన్నను తీసుకువస్తామని సీఐ హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

ప్రజాసమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ లక్ష్యం

- పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జనవరి 2: ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమ ఫలాలను అర్హులందరికి అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా మంగళవారం నందనంలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ ఐదు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తులు ఇవ్వని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మరిన్ని రోజుల గడువు ఇవ్వడానికి కృషిచేస్తుందన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీవో రఘుపతిరెడ్డి, సర్పంచ్ యాకర మంజులాయాదగిరి, ఎంపీటీసీ జెట్టబోయిన లక్ష్మీ, ఉప సర్పంచ్ మౌనికరాము, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులు పెన్నులు, పెన్సిళ్ల ఎమ్మెల్యేకు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో అనారోగ్యానికి గురైన వారిని పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు బండి సంపత్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలలోని సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలోని గుంతలను పరిశీలించిన ఎమ్మెల్యే ముందుగా వాటిని పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాలల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అడిషినల్ కలెక్టర్ మహేందర్‌జీకి సూచించగా పాఠశాలలను సందర్శించి నివేదికను అందజేస్తామని తెలిపారు. నందనంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఫ్లెక్సీల వివాదం తలెత్తి ఫ్లెక్సీలను చింపి తొలగించారు. ఎమ్మెల్యే తొలి సారి ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామానికి వస్తున్నాడని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఎన్నికల ముందు పార్టీలో చేరినవారితోపాటు స్థానికంగా ఉండని వారు ఫ్లెక్సీల్లో తమ ఫోటోలను పెద్దవిగా ముద్రించుకొని సీనియర్ల ఫోటోలు పెట్టలేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఫ్లెక్సీల వివాదానికి తెరతీసి చింపివేశారు. ఎమ్మెల్యే వస్తే పరువుపోతుందని గ్రామ పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను మొత్తం తొలగించి వివాదానికి తెరదించారు.


నందనం గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల షురూ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 2 : జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 104, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు 15, మోడల్ స్కూల్స్ 8 వెరసీ 127 పాఠశాలలుండగా వాటిల్లో 4405 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో బాలురు 2296, బాలికలు 2109 మంది మార్చి 18న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగనున్న వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రభుత్వం నిర్ణయించిన కాల నిర్ణయ పట్టికతో పాటు ప్రతి రోజు ఉదయం 8 :30 నుంచి 9:30 వరకు, సాయంత్రం 4:45 నుంచి 5:45 వరకు ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున తరగతులు నిర్వహిస్తూ పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి జిల్లా వందశాతం ఫలితాలు సాధించే విధంగా పక్కా ప్రణాళికతో విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నారు.

ఆరు పేపర్లు, ఏడు పరీక్షలకు అనుగుణంగా...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలు ఆరు పేపర్లుండగా ఏడు పరీక్షలు నిర్వహించేందుకు వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో తెలుగు, హింది, ఇంగ్లీష్, సామాన్యశాస్త్రం, గణితం, సాంఘీక శాస్త్రం 6 సబ్జెక్టులకు ఆరు పరీక్షలు నిర్వహించగా ఈ ఏడాది నిర్వహించనున్న వార్షిక పరీక్షలకు సామాన్య శాస్త్రంను భౌతికరసాయనశాస్త్రం, జీవశాస్త్రం పేపర్లుగా విభజించి పరీక్ష నిర్వహించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో ఏడు పేపర్లకు అనుగుణంగా మాదిరి ప్రశ్నాపత్రాలు, వాటికి వచ్చే మార్కుల ప్రకారం విద్యార్థులను సంసిద్ధులను చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు. దీంతో డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి చేయించిన విద్యాశాఖ జనవరి 2 నుంచి రెగ్యులర్ తరగతులలో సిలబస్ రివిజన్ చేయడంతో పాటు హెచ్ఎంలు ప్రత్యేక తరగతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.


కురవి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాయిని


కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 2 : కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేద విద్యార్థుల కోసం ఎమ్మెల్యే నోట్‌బుక్స్ అందజేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసినందుకు ఎమ్మెల్యేకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇవి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెలాఖరులోగా రైస్ మిల్లర్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

హనుమకొండ రూరల్, జనవరి 2 : పెండింగ్‌లో ఉన్న రైస్ మిల్లుల యాజమాన్యం గడువులోగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన గడువులోగా రైస్ మిల్లర్లు బియ్యానికి సంబంధించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్‌లో వచ్చిన ధాన్యం నుంచి రావాల్సిన బియ్యం పలు మిల్లుల నుంచి ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 31వ తేదీలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మీ, డీఎం మహేందర్, సివిల్ సప్లయీస్ డీటీలు రమేశ్, కృష్ణ, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 17 మంది డీబార్

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన 17 మందిని తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.తిరుమలదేవిలు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరీక్షల కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్ పాల్పడిన ఐదుగురిని, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని కళాశాలలో 8 మందిని, ఉమ్మడి ఖమ్మంలో జిల్లాల పరిధిలోని కళాశాలల్లో మరో 4 మంది డీబారైనట్లు తెలిపారు.

కేయూలో ఇద్దరికి బోధనేతర కారుణ్య ఉద్యోగాలు

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగ విధుల్లో పని చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు బోధనేతర సిబ్బంది ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలలో భాగంగా ఇద్దరికీ ఉద్యోగాలు కల్పించారు. ఈ మేరకు మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరీక్ష విభాగంలో పనిచేస్తూ మృతి చెందిన నారగోని వెంకన్న కుమారుడు నారగోని శివాజీ గౌడ్‌కు క్లర్క్ కం టైపిస్టుగా, అలాగే సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పనిచేసిన బస్కుల పోచయ్య కుమారుడు బస్కుల సునిల్‌కు కామాటిగా వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్యోగ నియమాకాల పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, ఇతర ఉద్యోగ సంఘాల నేతలు, వర్సిటీ ఉద్యోగులుపాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

హనుమకొండ క్రైం, జనవరి 2 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి రమేష్ మంగళవారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. జీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబరు 31, జనవరి 1న రాత్రి హనుమకొండ పరిధిలోని కుమార్‌పల్లి, కేయూ జంక్షన్, అశోక జంక్షన్, పెద్దమ్మగడ్డ ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో సుమారు 75 మందిని మద్యం తాగినట్టు గుర్తించి మంగళవారం కోర్టుకు తరలించారు. వీరిలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నారాయణతండాకు చెందిన అజ్మీర ప్రకాశ్, వరంగల్ దేశాయిపేటకు చెందిన తమ్మిశెట్టి తిరుపతిలకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఇంకా 73 మందికి రూ. 1.22 లక్షల జరిమానా విధించారు. జైలు శిక్ష పడిన వారిని కోర్టు హెడ్‌కానిస్టేబుల్ రాచకొండ రమేష్ పరకాల జైలు అధికారులకు అప్పగించారు.

ఉపాధి శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మడికొండ, జనవరి 2: మడికొండ వ్యాసపురి కాలనీలోని వేదవ్యాస పబ్లిక్ స్కూల్ ఆవరణలో సేవా భారతి, గోద్రేజ్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం కౌశలం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నిర్వాహకులు రాసమల్ల మహేష్ తెలిపారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్ ఓవెన్ తదితర గృహోపకరణ వస్తువుల రిపేరులో శిక్షణ ఇచ్చి అనంతరం వారికి గోద్రేజ్, రిలయన్స్, ఐఎస్‌ఫీ వంటి ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే శిక్షణలో ఆసక్తి గల నిరుద్యోగ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 90599 07740 నెంబర్‌లో సంప్రదించాలని మహేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి,జెడ్పీటీసీ సరిత,సర్పంచ్ రాజిరెడ్డి,ఎంపీటీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

7న డీటీయూ ఆవిర్భావ సభ

డీటీయూ రాష్ట్ర నేత దామెర ఉపేందర్


డీటీయూ ఆవిర్భావ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

వడ్డెపల్లి, జనవరి 2: మహనీయులు గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతి రావుపూలే, సావిత్రిబాయి పూలే, జాన్ డ్యూయి ఎడ్యుకేషనల్ ఫిలాసఫర్, బీఆర్. అంబేద్కర్ అందించినటువంటి జ్ఞాన వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి ఆలోచన విధానంలో పనిచే యడం కోసం ఈ నెల 7న హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని ఎస్‌వీకే కన్వెన్షన్ హాల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల నాయక త్వంలో ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు డీటీయూ రాష్ట్ర నేత దామెర ఉపేందర్ తెలిపారు. మంగళవారం రాంనగర్‌లో నిర్వహించిన డీటీయూ ఆవిర్భావ సన్నాహక కమిటీ బాధ్యుల సమావేశంలో ఆవిర్భావ సభకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 80 వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని అన్నారు. మహనీయుల ఆలోచనలతో ధర్మ టీచర్స్ యూనియన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపాధ్యాయులు సంఘటితం కావల్సిన సమయం ఆసన్న మైందని పేర్కొన్నారు. ఆవిర్భావ సభకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. డీటీయూ ఆవిర్భావ బాధ్యులు సాంబయ్య, శ్యాంసుందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 2: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న గోవులను మంగళవారం సాయంత్రం డివిజన్ కేంద్రంలో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నిర్వాహకులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్సై జగదీష్ తెలిపిన ప్రకారం వేములవాడ గోశాల నుంచి మండలంలోని జీకే తండాకు 20గోవులను తరలించేందుకు పర్మిట్ తీసుకుని దారిమళ్లించి హైదరాబాద్‌కు తరలిస్తుండటంతో గోశాల నిర్వాహకులు పట్టణ శివారులో పట్టుకోవడం జరిగిందన్నారు. డీసీఎం నంబర్ టీఎస్ 30 టీఏ0850 లో తనిఖీ చేయగా 24గోవులు ఉన్నాయన్నారు. డీసీఎంలో ఉన్న ఎల్. భాస్కర్, ఎ. సంతోష్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే గేటు మూసివేత

కమలాపూర్, జనవరి 2 : హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వేస్టేషన్‌ల మధ్య గల ఎల్కతుర్తి మండలంలోని బావుపేట రైల్వే గేటు (నెంబరు 9ఈ) ఈ నెల 4, 5వ తేదీ వరకు రెండు రోజుల పాటు గేటు మూసివేయనున్నట్లు కాజీపేట రైల్వే సీనియర్ సెక్షన్ అధికారి జీపీ.సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్-హనుమకొండ వెళ్లే మార్గంలోని ఏకైక గేటు కావడంతో ప్రయాణికులు ప్రత్యామ్నయ మార్గాల్లో వెళ్లాలని ఆయన సూచించారు. కాగా హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వే స్టేషన్‌ల మధ్య కొత్తగా వేసిన మూడో రైల్వే లైన్ ట్రాఫిక్, పవర్ బ్లాకింగ్ అనుసంధాన పనుల వల్ల సికింద్రాబాద్ నుంచి కాగజ్ నగర్ మార్గంలో నడిచే అన్ని ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 13వ తేదీ వరకు రద్దు చేయబడ్డాయని, కేవలం హైదరాబాద్-కాగజ్‌నగర్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ట్రిన్ నెంబరు అప్ 17011, డౌన్ 17012 మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

'ఇసుక ర్యాంపు నిర్వహణపై చర్యలు తీసుకోవాలి'

వెంకటాపురం(నూగూరు), జనవరి 2: నిబంధనలు పాటించని ఇసుక ర్యాంపు నిర్వహణపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా ఉపాధ్యక్షుడు చింత సోమరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన తుడుందెబ్బ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లో గిరిజన ఇసుక క్వారీల్లో రెజ్లింగ్ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ఇసుక క్వారీలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాయం కిరణ్, వాసం ప్రవీణ్, విష్ణుమూర్తి, చింత విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రాములు

భూపాలపల్లిటౌన్, జనవరి 2: ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను భూపాలపల్లి డీఎస్పీ రాములు ఆవిష్కరించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఫొటో గ్రాఫర్స్ రఫీ, నేరేళ్ల శ్రీనివాస్, రాజు, రమేష్, శంకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు క్యాలెండర్

గణపురం : మండలంలోని చెల్పూరు మున్నూరు కాపు సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగ్గా ముఖ్య అతిథిగా ఎస్సై సాంబమూర్తి హాజరయ్యారు. పొనగంటి మలహాల్‌రావు, కావటి రవి, ప్రభాకర్, వినోద్ కుమార్, శంకర్ దేవేందర్, రాజయ్య, సారయ్య పాల్గొన్నారు.

ఆరు జీపీల్లో ప్రజాపాలన గ్రామ సభలు

కాటారం, జనవరి 2: మండలంలోని కాటారం, రేగులగూడెం, చిద్నెపల్లి, గుండ్రాత్‌పల్లి, అంకుసాపూర్, జాదరావుపేట జీపీల్లో ప్రజాపాలన గ్రామసభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని 24 జీపీల్లో ఇప్పటి వరకు 18 జీపీల్లో గ్రామసభలు ప్రారంభం కాగా ప్రస్తుతం మరో ఆరు జీపీల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేసిన ప్రింటెడ్ దరఖాస్తులను ప్రజలకందించి వాటిని పూర్తిచేసిన అనంతరం అధికారులు స్వీకరించారు. ఎంపీడీవో శంకర్‌నాయక్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో ఉపేంద్రయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్, ఏఈ రాజశేఖర్, ఏవో రామకృష్ణల నేతృత్వంలోని ఆరు బృందాలు గ్రామసభల్లో దరఖాస్తులను స్వీకరించి, ప్రజల సందేహాల నివృత్తి చేశాయి. మండల ప్రత్యేకాధికారి సంజీవరావు పర్యవేక్షించారు. ఆరు గ్రామపంచాయతీల పరిధిలో 4 వేల దరఖాస్తులు రాగా మండల వ్యాప్తంగా మొత్తం 8,145 వచ్చి నట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రామసభల్లో సర్పంచులు తోట రాధమ్మ, దోమ రాహుల్, సుమలత, రాజమౌళి, రాజయ్య, డిప్యూటీ తహసీల్దార్ రాంమోహన్, జీపీ ప్రత్యేకాధికారులు జీపీ కార్యదర్శులు సమీర్‌ఖాన్, కృష్ణవేణి, నవ్యశ్రీ, దేవేందర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

భూపాలపల్లిటౌన్, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన సంక్షేమ పథకాలు పేదలందరికీ దక్కేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి పట్టణ పరిధి సెగ్గంపల్లిలో మంగళవారం నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆరు గ్యారెంటీ పథకంలో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం పథకాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం లబ్ధి పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామన్నారు. మిగతా పథకాలను కూడా అమలు చేయడంలో భాగంగా అధికారులు ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తులు స్వీకరించేలా ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ పథకాలను పూర్తి పారదర్శకతతో అమలు చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, మునిసిపల్ కమిషనర్ అనిల్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఆకినపల్లి గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ జరగ్గా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. అనంతరం 38 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో కృష్ణవేణి, ఆర్ఐ సురేందర్‌రెడ్డి, సర్పంచ్ వనమాల, ఎంపీటీసీ రాజేశ్వరి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కట్టంగూరి రామనర్సింహారెడ్డి, శ్రీరాంరెడ్డి, మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, నాయకులు నడిగోటి రాము, బండి సుదర్శన్, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ

చిట్యాల : మండలంలోని చల్లగరిగలో ప్రజాపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తామన్నారు. సీఎం రేవంత్ నేతృత్వంలో సమర్థ పాలనను అందిస్తామని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజాసేవ చేస్తానన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. చిట్యాల సామాజిక ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

గత ఏడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలతో మండలంలోని ముచినిపర్తి శివారు వెంకటేశ్వర్లపల్లి, వెంచరామి గ్రామాలు నీటిలో మునిగిన విషయం తెలిసిందే. నెస్లే కంపెనీ సహకారంతో 43 బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, ఎంపీడీవో రామయ్య సర్పంచ్‌లు కర్రె మంజుల, నందికొండ కవిత, కామిడి రత్నాకర్‌రెడ్డి, ముకిరాల మధువంశీకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ఉప సర్పంచ్ సంగ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ములుగు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, ఉద్యోగులు

ములుగు కలెక్టరేట్, జనవరి 2: నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ చాంబర్‌లో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్‌తోపాటు ఉద్యోగ సంఘాలు, సిబ్బంది మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో మనం జిల్లాలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడంతోపాటు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ఇళ్లలో, కార్యాలయాల్లో, మార్కెట్లలో తగ్గించాలని అన్నారు. జిల్లా అధికారులెవరు కూడా ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండేలా ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. 2024 నూతన సంవత్సరంలో మనం ఆదర్శంగా నిలవాలని, ఆదిశగా అందరూ కృషి చేయాలని అన్నారు. ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధపెట్టి జాతరను ప్రజాప్రతినిధుల సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు.

పీహెచ్‌సీని అందుబాటులోకి తేవాలి

అధికారులతో భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

మహదేవపూర్ రూరల్, జనవరి 2 : పలిమెల మండల ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మహదేవపూర్, పలిమెల మండలాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. పలిమెల మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం ఎంపిక చేసిన భూమిని కలెక్టర్ పరిశీలించారు. పలిమెలకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేటాయించిన నేపథ్యంలో సంబంధిత భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దారుకు సూచించారు. నిర్మాణానికి సంబంధించిన టెండర్లను త్వరలో ఆహ్వానిస్తామని అన్నారు. పీహెచ్‌సీ ఏర్పాటైతే పలిమెల వాసులకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. మండలంలో రూ.70 లక్షలతో మండల కార్యలయాల కాంప్లెక్స్ భవనం నిర్మిస్తామన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను పలిమెలలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం పంకెనలోని కేజీబీవీని పరిశీలించి విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మహదేవపూర్ మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఐబీ, ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలను వినియోగంలోకి తేవాలన్నారు. అందుకు మరమ్మతులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో నారాయణ, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, జడ్పీటీసీ గుడాల అరుణ, ఎంపీపీ రాణిబాయి తదితరులు ఉన్నారు.



అతిథి గృహాలను పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

'ప్రతిభావంతులకు డీఎన్ఆర్ ట్రస్టు అండ'

ములుగు కలెక్టరేట్, జనవరి 2: ప్రతిభావంతులకు డీఎన్ఆర్ ట్రస్టు అండగా ఉంటుందని ట్రస్టు వ్యవస్థాపకులు దొడ్డ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ములుగు మండలంలోని అబ్బాపురం జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఐఐటీ భువనేశ్వర్‌లో సివిల్ ఇంజనీరింగ్ చదువుతున్న గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కలువల యువరాజు తల్లిదండ్రులకు లాప్‌టాప్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని గణిత ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందాల రామయ్య చేస్తున్న విద్యాసంబంధ పరిశోధనలు, రచనా కార్యక్రమాలకు ఉపయుక్తంగా ఉండేందుకు లాప్‌టాప్ అందజేసినట్లు తెలిపారు. ములుగు ప్రాంతంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థుల ఉన్నత విద్యకు డీఎన్ఆర్ ట్రస్టు వెన్నుదన్నుగా ఉంటూ అండగా నిలుస్తుందని అన్నారు. అందరి సహకారంతో విద్య, గ్రామీణాభివృద్ధి సంబంధిత సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి కల్పన, ట్రస్టు సలహాదారు సైకం శ్రీనివాసరెడ్డి, గ్రామపెద్దలు గండి కుమార్, కలువల భద్రయ్య ఉపాధ్యాయులు హనుమాన్, సురేందర్, పాపిరెడ్డి, రవీందర్, శ్రీధర్, పరిమళ, శ్రీదేవి, జ్యోతి పాల్గొన్నారు.

'హద్దులు' మీరిన కబ్జాదారులు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 2: జిల్లా కేంద్రంలో భూఆక్రమణలు పెరుగుతున్నాయి. ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. కబ్జాదారులు కాజేస్తున్నారు. పుల్లూరురామయ్యపల్లి శివారులోని గోరంట్లకుంట శిఖం భూమిలో అలాంటి ఉదంతమే చోటుచేసుకుంది. నీటిపారుదల శాఖ అధికారులు వేసిన హద్దులను తొలగిస్తూ కొందరు కబ్జా చేసేందుకు యత్నించారు. డిసెంబరు 20న గోరంట్లకుంట శిఖం భూమి కబ్జాకు గురైందని గుర్తించిన నీటిపారుదల శాఖ అధికారులు రెవెన్యూ, మునిసిపల్, సర్వేల్యాండ్ శాఖ ఆధ్వర్యంలో హద్దులను ఏర్పాటు చేశారు. అయితే.. అధికారులు వేసిన హద్దులను ఆక్రమణదారులు తొలగించారు. హద్దుల ను గుర్తించే దిమ్మెలను తీసేశారు. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు మళ్లీ మంగళవారం హద్దులను ఏర్పాటు చేశారు. మళ్లీ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే కఠినంగానే వ్యవహరిస్తామని నీటిపారుదల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే చెరువు శిఖం భూమిలో ఆక్రమణదారులు వెంచర్ ఏర్పాటు చేయడం తోపాటు సర్వే నంబరు 209కు బదులు 213గా వేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారులు గుర్తించారు.



శిఖం భూమిలో తొలగించిన హద్దులను మళ్లీ ఏర్పాటుచేస్తున్న నీటిపారుదల శాఖ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఒకరిమృతి

- అభయహస్తానికి దరఖాస్తు చేసి వెళ్తుండగా దుర్మరణం

లింగాలఘణపురం, జనవరి2: మండలంలోని వడ్డిచర్ల గ్రామం వద్ద జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మండలం వీరారం శివారు కెలావత్ తండాకు చెందిన కెలావత్ నరేష్(35) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేష్ హైదరాబాద్‌లో నివాసముంటూ ఓ తెలుగు దినపత్రికలో పని చేస్తున్నాడు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వీరారం గ్రామపంచాయతీలో మంగళ వారం అభయహస్తం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు స్వగ్రామానికి వచ్చి తిరిగి వదిన కవితతో కలిసి బైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో వడ్డిచర్ల వీరభద్ర పెట్రోల్ బంక్‌వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నరేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కవిత స్వల్పగాయాలతో బయట పడింది. నరేష్‌కు భార్య విమల, ఇద్దరు కుమారులు ఉన్నారు. లింగాలఘణపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయోధ్య అక్షింతల శోభాయాత్ర



ఎల్లారెడ్డిపల్లిలో అక్షింతలతో గ్రామస్థులు

వెంకటాపూర్(రామప్ప), జనవరి 2: అయోధ్య నుంచి మండల కేంద్రంలోని రామాలయానికి వచ్చిన అంక్షింతలను రామాలయం వేదపండితులు ముదుంబా రఘునాథచార్యులు, ఆలయ చైర్మన్ భాస్కర్, సభ్యులు చింతిరెడ్డి రమణారెడ్డి, పల్నాటి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ఎల్లారెడ్డిపల్లి హనుమాన్ భక్తులు, గ్రామస్థులు డప్పుచప్పుళ్ల మధ్య అక్షింతలను గ్రామానికి చేరవేసి ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. దీంతో గ్రామం శ్రీరామనామస్మరణతో మార్మోగింది. ఈనేపథ్యంలో గ్రామస్థులు తమ ఇళ్లముందు నీటిని ఆరగిస్తూ మంగళహారతులతో అక్షింతలకు ఘనస్వాగతం పలికారు. శోభాయాత్ర అనంతరం అక్షింతలను గ్రామంలోని హనుమాన్ దేవాలయానికి చేర్చి వేదపండితులు కొలనుపాక శివుడు ఆధ్వర్యంలో గ్రామస్థులు, హనుమాన్ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు, గ్రామపెద్దలు బేతి సతీష్, భైకని చిన్న రాజయ్య, పులి కోటయ్య, చింతిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బండి శ్రీను, మెంతుల వంశీ, బన్నీ, సంతోష్, సోమిడి రవి, పులాల రత్నం, నరేష్, రంజిత్, నర్సయ్య, కొలనుపాక సంపత్, శివుడు, లెంకల తిరుపతి, మర్రి లడ్డు, వలబోజు సత్యం, రాహుల్, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పంపిణీ

వెంకటాపురం(నూగూరు), జనవరి 2: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను మంగళవారం మండల భక్తమండలి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని శివాపురం, జక్కులవారి వీధి, టవర్స్ సెంటర్లలో ఇంటింటికీ వెళ్లి గ్రామస్థులకు అక్షింతలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో భక్తమండలి సభ్యులు లక్ష్మీపతి, మాధవి, నారాయణమ్మ, నర్సింహారావు, రాణి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవర జాతరకు నిధులు కేటాయించండి

మంత్రి శ్రీధర్‌బాబుకు ఆదివాసీ నాయక్‌పోడ్ నేతల వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రమందిస్తున్న నాయకులు

కాటారం, జనవరి 2: గొంతెమ్మగుట్ట లక్ష్మీదేవర జాతరకు నిధులు కేటాయించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం నేతలు కోరారు. హైదరాబాద్‌లో మంత్రిని ప్రతాపగిరి, గొంతెమ్మగుట్ట గిరిజన కమిటీ సభ్యులు మంగళవారం కలిశారు. జాతరకు హాజరుకావాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందించారు. జాతరకు పలు ప్రాంతాల నుంచి వేలాదిగా హాజరయ్యే భక్తులకు వసతి, సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం, ఐటీడీఏ చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారని సంఘం నేతలు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో గుంటి అశోక్, పోలం సంతోష్ ఉన్నారు.

కిచెన్‌షెడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, జనవరి 2: తుది దశకు చేరుకున్న కిచెన్‌షెడ్ల నిర్మాణాన్ని ఈవారం చివరిలోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ములుగు మండలంలోని ఇంచర్ల గ్రామశివారులో జరుగుతున్న కిచెన్‌షెడ్ నిర్మాణ పనులను ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. ములుగు జిల్లాకు వచ్చే పర్యాటకులకు, మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం కిచెన్‌షెడ్ల నిర్మాణాన్ని చేపట్టిందని అన్నారు. మేడారం మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో వాటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈనెల 7లోగా నిర్మాణాలను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కిచెన్‌షెడ్లలో సేద తీరే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు అందేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆమె గోవిందరావుపేట చల్వాయి గ్రామ పరిధిలో నిర్మిస్తున్న కిచెన్‌షెడ్ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయా లన్నారు. వారి వెంట ఐటీడీఏ ఈఈ హేమలత, కాంట్రాక్టర్లు, అధికారులు ఉన్నారు.

'దళితబంధు' డబ్బులు జమ చేయాలి : మాల మహానాడు

మంగపేట, జనవరి 2: దళితబంధు పథకం రెండో విడత లబ్ధిదారులకు డబ్బులను వారి బ్యాంకు అకౌంట్‌లో వెంటనే జమ చేయాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కర్రి శ్యాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని రాజుపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితబంధు రెండో విడత లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి ఉందని, దీనికి సంబంధించి రూ. 26.49 కోట్లు కలెక్టర్ అకౌంట్‌లో ఉన్నాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ పథకాన్ని నిలిపివేశారని అన్నారు. ఎన్నికలు ముగిసిన దృష్ట్యా ఆ డబ్బులను లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

వెంకటాపూర్(రామప్ప), జనవరి 2: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని నర్సాపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామంలోని ఆటికె రవికి చెందిన దుక్కిటెద్దు గ్రామశివారులో మేత మేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుకుంది. ఈక్రమంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్ ప్రసారం జరిగి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతోనే ఈఘటన చోటుచేసుకుందని గ్రామస్థులు ఆరోపించారు.

ప్రతి దరఖాస్తునూ స్వీకరించాలి : అదనపు కలెక్టర్



పస్రాలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

గోవిందరావుపేట, జనవరి 2: సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన సభలలో ప్రజలు అందించే అన్నిరకాల దరఖాస్తులను స్వీకరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని పస్రాలో కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామసభను ఆమె పరిశీలించారు. ప్రజల సౌలభ్యం కోసం ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేశారు, దరఖాస్తులను అందుబాటులో ఉంచారా, దరఖాస్తులను నింపేందుకు సిబ్బంది ప్రజలకు సహకారం అందిస్తున్నారా, తాగునీరు, నీడ, కుర్చీలు తదితర సౌకర్యాలను పరిశీలించారు. దరఖాస్తుఫారంలో నిర్దేశించిన వివిధ పథకాల తోపాటు ఇతర అంశాలపై ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా స్వీకరించి రశీదు అందించాలని సూచించారు.

'ప్రజాపాలన'లో స్పెషలాఫీసర్


తాడ్వాయి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన అభయహస్తం గ్రామసభలు మంగళవారం మండలంలోని కొడిశాల, లింగాల గ్రామాల్లో కొనసాగాయి. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో, మండల స్పెషలాఫీసర్ డాక్టర్ అల్లెం అప్పయ్య ఆయా గ్రామసభల్లో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అదేవిధంగా కొడిశాలలో వైద్యసిబ్బంది ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊకె మౌనిక, అధికారులు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద కేవైసీ కష్టాలు

వెంకటాపురం(నూగూరు), జనవరి 2: గ్యాస్ ఏజెన్సీల వద్ద కేవైసీ కోసం వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 18 గ్రామపంచాయతీల్లోని వినియోగదారులు ఇండియన్, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీల వద్దకు చేరుకుని కేవైసీ చేయించుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులు తప్పకుండా కైవైసీ చేయించుకోవాలని నిబంధన పెట్టడంతో వినియోగదారులు పనులు మానుకొని గ్యాస్ ఏజెన్సీల వద్దకు పరుగు తీస్తున్నారు. దీంతో ఆయా ఏజెన్సీల వద్ద వినియోగదారులు పెద్దసంఖ్యలో బారులుతీరారు.

గుడుంబా స్థావరాలపై యూత్ దాడి

తాడ్వాయి, జనవరి 2: మండలంలోని గంగారం పంచాయతీ పరిధిలోని ఇమ్మడిగూడెంలో మంగళవారం గంగారం గ్రామానికి చెందిన యవజనులు మూకుమ్మడిగా గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. గూడెంలోని ప్రతి ఇంటినీ తనిఖీ చేసి బెల్లంపానకం డ్రమ్ములను, బెల్లంపానకాన్ని, గుడుంబాను పట్టుకుని ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేయొద్దని పలుమార్లు చెప్పినా, అధికారులకు సమాచారం ఇచ్చి తనిఖీలు చేయించి కేసులు నమోదు చేయించినా తయారీదారులు తమ పద్ధతిని మార్చుకోకపోవడంతో దాడులు నిర్వహించినట్లు యూత్ సభ్యులు తెలిపారు.



బెల్లంపానకాన్ని ధ్వంసం చేస్తున్న యువకులు